ప్రజాశక్తి
శనివారం మే 4 2024 8 పేజీలు
శ్రీకాకుళం



9న చంద్రబాబు రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 9న జిల్లాకు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నరసన్నపేటలో ఆరోజు ఉదయం 11 గంటలకు నిర్వహించే ప్రజాగళం సభలో పాల్గొనున్నారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ కోరారు.

టిడిపిలో అచ్చెన్న చిచ్చు

- వరం కుటుంబానికి మేయర్ పదవి హామీ
- మండిపడుతున్న శ్రీకాకుళం టిడిపి ఆశావహులు
- ఫిరాయింపులపై ధర్మాన అనుయాయుల మండిపాటు
- ధర్మాన, కింజరాపు కుటుంబాల మధ్య రాజకీయ బంధానికి బ్రేక్!



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం నియోజకవర్గంలో అసలే టిడిపి కేడర్ అసంతృప్తితో రగిలిపోతోంది. దీనికితోడు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల వ్యవహరించిన తీరు అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఇటీవల మున్సిపల్ మాజీ చైర్మన్ వరం కుటుంబానికి మేయర్ పదవి హామీ ఇవ్వడంతో, టిడిపి ఆశావహులు మండిపడుతున్నారు. పార్టీ కోసం ఇన్నాళ్లు కష్టపడిన వారిని విస్మరించి, ఆ కుటుంబానికి ఆఫర్ చేయడమేమిటని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండ లక్ష్మీదేవికి టిక్కెట్ రాకుండా చేసిన అచ్చెన్నాయుడు, ఆమె వెంట ఉన్న నాయకులనూ వదలడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గుండ కుటుంబానికి టిక్కెట్ రాకపోయినా, టిడిపిని నమ్ముకున్న ముఖ్య నాయకులంతా ప్రస్తుతం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ గెలుపు కోసమే పనిచేస్తున్నారు. ఈ సమయంలో ఇలా వ్యవహరించడం పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తాయనే అభిప్రాయం వినిపిస్తోంది.

శ్రీకాకుళం నియోజకవర్గంపై తొలి నుంచీ దృష్టి పెట్టిన టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు టిక్కెట్ల కేటాయింపు విషయంలో తాననుకున్నది సాధించుకున్నారు. శ్రీకాకుళం నుంచి గుండ లక్ష్మీదేవిని తప్పించి గొండు శంకర్‌కు సీటు ఇప్పించడంలో కీలకపాత్ర వహించారు. టిక్కెట్ ఇప్పించడంతో తన బాధ్యత తీరిందనుకున్న అచ్చెన్నాయుడుకు గెలిపించే బాధ్యతనూ అప్పగించింది. దీంతో శ్రీకాకుళం నియోజకవర్గంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై అసంతృప్తితో ఉన్న నాయకులపై ఆరా తీయడం మొదలు పెట్టారు. అందులో భాగంగానే శ్రీకాకుళం నగరానికి చెందిన వరం కుటుంబాన్ని పార్టీలో చేర్చుకున్నారు. వైసిపిలో పార్టీ ఫిరాయింపులు, గొండు శంకర్ గెలుపు కోసం ప్రయత్నించడమంటే ధర్మాన ఓటమి కోసం పనిచేసినట్లుగానే చూడాల్సి ఉంటుంది. తన ఓటమి కోసం ప్రయత్నిస్తే ధర్మాన నుంచీ అదే స్థాయిలో స్పందన ఉంటుందనే చర్చ వైసిపిలో సాగుతోంది.

ఇరకాటంలో అచ్చెన్నాయుడు

రాజకీయ (మిగతా...2లో)

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- హోం ఓటింగ్ వినియోగానికీ ఏర్పాట్లు
- ఓటు హక్కు ఉపయోగించుకోనున్న 25,505 మంది ఓటర్లు
- ఓటు వేయాలంటూ ప్రధాన పార్టీల అభ్యర్థుల ఫోన్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లాలో పలుచోట్ల ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేటి నుంచి ఈనెల ఏడో తేదీ వరకు ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇదే సందర్భంలో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగులు హోం ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును ఉపయోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కీలకంగా కావడంతో ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. ఉద్యోగులకు స్వయంగా అభ్యర్థులే ఫోన్ చేసి తమకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ కోసం 25,505 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పిఒలు, ఎపిఒ, ఇతర పోలింగ్ సిబ్బంది మొత్తం 15,627 మంది ఉన్నారు. ఎన్నికల్లో ఇతర రకాల విధుల్లో పాల్గొనే బృందాలు, బిఎల్‌ఒలు, ఎఆర్‌ఒలు, ఎంపిడిఒ, ఇతర రెవెన్యూ సిబ్బంది, డ్రైవర్లు, వీడియోగ్రాఫర్లు మొత్తం 4,134 మంది ఉన్నట్లు గుర్తించారు. పోలీసు సిబ్బంది, ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్, మాజీ సైనికుల కేటగిరీలో 1873 మంది ఉన్నారు. హోం ఓటింగ్ కేటగిరీలో 495 మంది ఉన్నారు. ఇతర జిల్లాలో పనిచేసే జిల్లా ఉద్యోగులు 3,296 మంది ఉన్నట్లు గుర్తించారు. ఓటింగ్ కోసం మొత్తం 25,505 పోస్టల్ బ్యాలెట్లు అవసరం కాగా, అదనంగా 20 శాతం రిజర్వులో ఉంచుతున్నారు. అంటే మొత్తం 30,606 పోస్టల్ బ్యాలెట్ల ఓట్లు అందుబాటులో ఉంచుతున్నారు.

ఉద్యోగుల కరుణ ఎవరిపైనో..?

ఉద్యోగులు, ఉపాధ్యాయులు అనేక సమస్యలను ఎదర్కొంటున్నారు. వీటిలో సిపిఎస్ రద్దు, పిఆర్‌సి, ఐఆర్ ప్రధాన సమస్యలు. తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని హామీనిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ (మిగతా...2లో)

నేడు తీవ్ర వడగాలులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా శనివారం 12 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశముందని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఒక ప్రకటనలో తెలిపారు. 13 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని పేర్కొన్నారు.

తీవ్ర వడగాలులు వీచే మండలాలు

ఆమదాలవలస, బూర్జ, జి.సిగడాం, పొందూరు, సరుబుజ్జిలి, హిరమండలం, జలుమూరు, కంచిలి, కొత్తూరు, పాతపట్నం, ఎల్‌ఎన్‌పేట, సారవకోట.

వడగాలులు వీచే మండలాలు

ఇచ్ఛాపురం, కవిటి, కోటబొమ్మాళి, మందస, నందిగాం, నరసన్నపేట, పలాస, సోంపేట, లావేరు, ఎచ్చెర్ల, పోలాకి, మెళియాపుట్టి, శ్రీకాకుళం.

జిల్లాలో మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు మండలాల్లో శుక్రవారం 43.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపారు. 17 మండలాల్లో తీవ్ర వడగాలులు, తొమ్మిది మండలాల్లో వడగాలులు వీచాయని పేర్కొన్నారు. వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రజలు ఇంట్లోనే ఉండాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు శేఖర్ విద్యార్థి

శాంతియుత ఎన్నికలే లక్ష్యం

ఇసిఐ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా, రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా చేయడమే ప్రధాన లక్ష్యం కావాలని భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. జిల్లాకు కేటాయించిన ఎన్నికల సాధారణ, వ్యయ పరిశీలకులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు శేఖర్ విద్యార్థి, పోలీస్ అబ్జర్వర్ దిగంబర్ పి.ప్రదాన్, నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు సందీప్ కుమార్, తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, వ్యయ పరిశీలకులు శరవణ కుమార్, కోమల్‌జిత్ మీనా, నవీన్ కుమార్ సోనీ, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్, ఎస్‌పి జి.ఆర్ రాధిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శక, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా అందరూ కృషి చేయాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కీలకమని, వారికి ఇవిఎంల వాడకంపై పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియలో వారు చేయాల్సిన, చేయకూడని పనులు అనే అంశాలను స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియలో లోపం ద్వారా రీపోలింగ్‌కు అవకాశం ఉండరాదని స్పష్టం (మిగతా...2లో)

ఇవిఎంల కమిషన్ ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇవిఎంల కమిషన్ ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలాశ్రీష సమూన్ ఆదేశించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇవిఎంల కమిషన్ ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. ఇవిఎంలపై సీరియల్ నంబర్లు, అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన చిహ్నాల ఏర్పాటు సిసి కెమెరాల ఎదుట పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి, ఇవిఎంల పనితీరు (మిగతా...2లో)



ఇవిఎంల కమిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఆధ్వర్యాన శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నగరంలోని వండాన, గ్లోబల్ న్యూరో కేర్ హాస్పిటల్స్‌ను తనిఖీ చేసి ఫైర్ ఎన్‌ఒసి, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫైర్ సేఫ్టీ సర్టిఫికేట్, లైసెన్స్ కాలపరిమితి దాటకుండా రెన్యువల్ చేసుకోవాలన్నారు. ఆమెతో పాటు ప్రోగ్రాం అధికారి (మిగతా...2లో)

మొదటి పేజీ తరువాయి

టిడిపిలో అచ్చెన్న చిచ్చు

పరిణామాలు ఎప్పుడు ఎలా మారుతాయో శ్రీకాకుళం నియోజకవర్గం ఒక ఉదాహరణ. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన గుండ లక్ష్మీదేవి, మంత్రి ధర్మాన ప్రసాదరావుకు గట్టి పోటీనిచ్చారు. వైసిపి ప్రభంజనంలో కేవలం 4,813 ఓట్లతో ఓటమిపాలయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆమె అభ్యర్థి అయితే కచ్చితంగా గెలుస్తామని టిడిపి శ్రేణులు చెప్తూ వచ్చాయి. ధర్మానకు మేలు చేసేందుకే తమ నేత స్థానంలో గొండు శంకర్‌కు టిక్కెట్ ఇప్పించారంటూ అచ్చెన్నపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. గొండు శంకర్‌కు టిక్కెట్ ఇప్పించడంతో ఇక తన పాత్ర ముగిసిందని అచ్చెన్నాయుడు భావిస్తున్న తరుణంలో శంకర్ గెలుపు బాధ్యతనూ అధిష్టానం ఆయన నెత్తిన పెట్టినట్లు తెలిసింది. అందులో భాగంగానే వైసిపిలో ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో ప్రతి నిమిషం విలువైనది కావడంతో, తన సొంత నియోజకవర్గం టెక్కలికి సమయం వెచ్చించాల్సిన అచ్చెన్నాయుడు ఇలా శ్రీకాకుళం నియోజకవర్గానికి కేటాయించాల్సి రావడంపై కొంత ఇబ్బందికరంగా భావిస్తున్నట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ నడుస్తోంది.

వారి బంధానికి బ్రేక్ పడినట్టేనా?

జిల్లా రాజకీయాల్లో ఇన్నాళ్లు లోపాయికారీ ఒప్పందాలతో సొంత పార్టీ నాయకులను ఓటమిపాల్జేసిన ఇరువురు నాయకుల బంధానికి ప్రస్తుత పరిణామాలతో బ్రేక్ పడినట్లు చర్చ నడుస్తోంది. ఎన్నికల్లో ధర్మాన, కింజరాపు కుటుంబాలు ప్రస్తుతం ఒకరికొకరు సహకరించే పరిస్థితులు కనపడడం లేదు. ధర్మాన ఓటమి కోసం పనిచేస్తున్న వారికి అదే స్థాయిలో శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాల నుంచి దాదాపు అన్ని ఎన్నికల్లో టిడిపి ఎంపీ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ జరుగుతూ వస్తోంది. ఈసారి క్రాస్ ఓటింగ్ ఉండకపోవచ్చనే వైసిపి సైతం భావిస్తోంది. కాగల కార్యం గంధర్వులే తీర్చినట్లు క్రాస్ ఓటింగ్ జరగకుండా ఈసారి ప్రత్యేక దృష్టిసారించిన వైసిపికి వీరి మధ్య రాజకీయ అగాథం కలిసొచ్చినట్లయింది. మొత్తమ్మీద అచ్చెన్న రాజకీయ ఆటలు ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడుకి తగిలేలా కనిపిస్తున్నాయి.

శాంతియుత ఎన్నికలే లక్ష్యం

చేశారు. ఇవిఎంల వినియోగం, రీప్లేస్‌మెంట్‌కు ఒక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఉందని, ఆ మేరకు మాత్రమే చర్యలు ఉండాలని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ జాగ్రత్తగా స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచాలని, వీడియోగ్రఫీ చేయాలన్నారు. పోలింగ్‌కు 72 గంటల ముందు నగదు, మద్యం, ఉచితాల పంపిణీ వంటివి జరగకుండా పటిష్ట నిఘా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో లైటింగ్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు ఉండాలని సూచించారు. ఫస్ట్ ఎయిడ్, నీడ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సాధారణ పరిశీలకులు శేఖర్ విద్యార్థి మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. పోలీస్ అబ్జర్వర్ దిగంబర్ పి.ప్రదాన్ మాట్లాడుతూ ఎస్ఎస్‌టి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తదితర ఏర్పాట్లు నిబంధనల మేరకు ఉన్నాయని చెప్పారు. జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్, ఎస్‌పి రాధిక మాట్లాడుతూ అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎప్పటికప్పుడు సీజర్ అంశాలు, ఎన్నికల వ్యయ పరిశీలన జిల్లాలో పక్కాగా ఉన్నాయన్నారు. జిల్లాలో సుమారు రూ.నాలుగు కోట్ల వరకు సీజర్ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశం నిర్వహించామని, ఓటరు స్లిప్పులు బిఎల్ఒల ద్వారా సంబంధిత ఓటరుకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎఎస్‌పి ప్రేమకాజల్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

జగన్మోహన్ రెడ్డి ఆ తర్వాత మాట మార్చారు. సిపిఎస్ రద్దు సాధ్యం కాదని చెప్తూనే, దాని స్థానంలో జిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చారు. జిపిఎస్ అంతకంటే ప్రమాదకరమైందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎస్ రద్దు కోసం అనేక పోరాటాలు సాగించారు. ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదాలతో ఆందోళనలూ చేశారు. ఆందోళనలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. మరోవైపు అధికారంలోకి రావాలని చూస్తున్న టిడిపి, జనసేన, బిజెపి కూటమి మేనిఫెస్టోలోనూ దీనిపై ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదు. ప్రజాగళం సభల్లో మాత్రం చంద్రబాబు అక్కడక్కడా సిపిఎస్ రద్దుపై అంశాన్ని అధ్యయనం చేస్తామని చెప్తున్నారే తప్ప రద్దు చేస్తామని ఎక్కడా ప్రకటించడం లేదు. మరోవైపు ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎటువైపు మొగ్గు చూపుతారన్నది ఆసక్తిగా మారింది.

ప్రక్రియ ప్రారంభం

పరిశీలించి, వారికి పూర్తిస్థాయిలో నమ్మకాన్ని కలిగించాలని సూచించారు. రెండో విడత ర్యాండమైజేషన్‌లో కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల నంబర్లను కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్‌లను ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించే ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు.

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాల తనిఖీ

అనంతరం అక్కడే నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఓటు అనర్హతకు గురికాకుండా సరైన పద్ధతిలో వినియోగించుకునేలా ముందస్తుగా తెలియజేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఈనెల నాలుగో తేదీ నుంచి నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తి కావాలన్నారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, శ్రీకాకుళం రిటర్నింగ్ అధికారి సిహెచ్.రంగయ్య, సహాయ రిటర్నింగ్ అధికారి బి.వి.రాణి, ఇతర అధికారులు ఉన్నారు.

ఆకస్మిక తనిఖీలు

డాక్టర్ సి.పి శ్రీదేవి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, వండాన కిరణ్‌కుమార్, గౌతమ్, డిప్యూటీ డెమో మహంతి వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్స్ సూర్యకళ, మోహిని తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18 ఏళ్ల మధ్య గల బాలల నుంచి కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రధాన్‌మంత్రి రాష్ట్రీయ్ బాల పురస్కారాలను ప్రదానం చేసేందుకు దరఖాస్తులను కోరుతున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్యసాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు తదితర అంశాల్లో ప్రతిభ కనబరచిన బాలలకు ఈ పురసాఉకరాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల బాలలు జూలై 31వ తేదీ లోగా https:/awards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పంపించాలని సూచించారు. ఎంపికైన బాలలకు వచ్చే ఏడాది జనవరిలో రాష్ట్రపతి చేతుల మీదుగా బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేయనున్నట్లు తెలిపారు.

హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లమో కోర్సులో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చేనేతజౌళి శాఖ ఎడి సిహెచ్.సాయిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జూన్ ఒకటో తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు అభ్యర్థులు www.iihtvgr.com వెబ్‌సైట్, 93999 36872, 98661 69908 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- మందస


షణ్ముఖరావు (ఫైల్)

మండలంలోని హరిపురం కొర్రయ్య గేటు సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌పై జారిపడి ఉపాధ్యాయుడు అంకర బోయిన షణ్ముఖరావు (44) శుక్రవారం మృతి చెందారు. మందసకు చెందిన షణ్ముఖరావు గురువారం సాయంత్రం పలాస నుంచి మందస వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈ సమయంలో బైక్ పైనుంచి జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు హరిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పలాస మండలం శాసనం ఎంపియుపి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


మధుసూదనరావు మృతదేహం


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని బూరగాంకు చెందిన పట్నాన వెంకటరమణ వద్ద అక్రమంగా ఉన్న 50 మద్యం సీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు టెక్కలి ఎస్ఇబి సిఐ రాజశేఖర్ నాయుడు తెలిపారు. గ్రామంలో తనిఖీలు నిర్వహించిన సమయంలో 180 మద్యం సీసాలు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్నాన వెంకటరమణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వలు కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని చీపురుపల్లి సమీపంలో గార ఆలయం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన నందిగాం మధుసూదనరావు (35) మృతి చెందాడు. టెక్కలిపట్నం నుంచి చీపురుపల్లి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడి తండ్రి సింహాద్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మహిళకు గాయాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి- మెళియాపుట్టి రోడ్డులోని ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్న పోలాకి సుందరమ్మ శుక్రవారం విద్యుదాఘానికి గురై తీవ్రంగా గాయపడింది. మండాపోలం కాలనీకి చెందిన సుందరమ్మ మిల్లులో కళాసీగా పనిచేస్తుంది. పనిలో భాగంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వెళ్లగా షాక్‌కు గురైంది. వెంటనే స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించిన జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేవారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన సుందరమ్మ


దగ్ధమవుతున్న గడ్డి వాములు

ఐదెకరాల గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి- బూర్జ

మండలం టిడిఆర్ రాజపేట (అయ్యవారిపేట) గ్రామానికి చెందిన లావేటి బాలరాజుకు చెందిన ఐదెకరాల గడ్డివాములు దగ్ధమయ్యాయి. శుక్రవారం ఈ ఘటన జరగడంతో గుర్తించిన స్థానికులు స్థానిక పాలకొండ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపులోకి తీసుకున్నారు. అయితే గడ్డి వాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. రూ.40 వేలు నష్టం వాటిల్లిందని యజమాని బాలరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరాడు. పశువులకు ఏడాదికి సరిపడా గడ్డి ఉంచుకున్నప్పటికీ అగ్నికి ఆహుతి కావడంతో ఏడాది మొత్తం పశువులకు ఎలా పెంచాలని రైతు బాలరాజు ఆవేదన వ్యక్తం చేశాడు.


ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

వైసిపితోనే అభివృద్ధి

కవిటి: రాష్ట్రంలో వైసిపితోనే అభివృద్ధి సాధ్యమని, ఐదేళ్లుగా సంక్షేమంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత వైసిపిదేని ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ రామారావు అన్నారు. మండలంలోని జగతిలో వైసిపి నాయకులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. పార్టీలకతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ పాలన కావాలంటే వైసిపి పార్టీ అధికారంలోకి రావాలని కోరారు. అనంతరం పలువురు టిడిపి, జనసేన కార్యకర్తలు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, నరేష్ కుమార్ అగర్వాల్, వైసిపి నాయకులు ఎన్.నరేంద్ర, కడియాల ప్రకాష్, పూడి నేతాజీ, పూడి వరప్రసాద్, బాబూరావు, నీలయ్య, ఎస్.పి.నారాయణస్వామి, అశోక్ పాల్గొన్నారు.

విశ్వనాథంకు నివాళి

పలాస: కీర్తిశేషులు మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం తన సొంత స్థలాన్ని విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వ ఐటిఐకు విరాళంగా ఇచ్చి ఆదర్శమూర్తిగా నిలిచారని డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్ అన్నారు. శుక్రవారం విశ్వనాథం వర్థంతి సందర్భంగా స్థాకి ప్రభుత్వ ఐటిఐలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకుడుగా 32 ఏళ్లు నిరాంబడరంగా జీవించారని కొనియాడారు. లయన్స్ క్లబ్‌లో చేరి వివిధ పదవులు చేపట్టి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. విశ్వనాథం సొంత నిధులతో విద్యార్థులకు వసతిగృహం నిర్మించి ఆశ్రమం కల్పించారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, జగదీశ్వరరావు, కిశోర్, దిలీప్, రమణయ్య యోహన్, నాను, చౌదరి, దామోదర్, రేవతి, కుమార్, మూర్తిలు పాల్గొన్నారు.

టిడిపికి ఓటేస్తే జన్మభూమి కమిటీలదే అధికారం

కోటబొమ్మాళి: టిడిపికి ఓటేసి గెలిపిస్తే మళ్లీ జన్మభూమి కమిటీలకు అధికారం వస్తుందని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు అన్నారు. మండలంలోని కన్నేవలస, చుట్టుగుండం, ఊడికలపాడులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, ఎంపీగా పేరాడ తిలక్‌లను గెలిపించాలని ఓటర్లను కోరారు. వైసిపి అన్నెపు రామారావు, బొడ్డు అప్పన్న, సంపతిరావు హేమసుందరరాజు, ఎంపిటిసిలు పూజారి సత్యం పాల్గొన్నారు.

జై భారత్ అభ్యర్థి ప్రచారం

కోటబొమ్మాళి: ప్రజలకు న్యాయం జరగాలంటే, న్యాయమైన పాలన అందాలంటే టార్చ్‌లైట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని టెక్కలి నియోజకవర్గ జై భారత్ నేషనల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బైపల్లి పరామేశ్వరరావు ఓటర్లును కోరారు. మండలంలోని లఖందిడ్డి, గంగరాం, కోటబొమ్మాళి, కొత్తపేటతో పాలు 20 గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోకి వెళ్లి జై భారత్ నేషనల్ పార్టీ అధినేత లక్ష్మీనారాయణ కోసం వివరించారు.

FORMAT C-1
DECLARATION ABOUT CRIMINAL CASES

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate : **APPALARAJU SEEDIRI**

Name of political party: **YUVAJANA SRAMIKA RYTHU CONGRESS PARTY**

Name of Election: **GENERAL ELECTIONS HOP/APLA – 2024**

Name of Constituency: **02 - PALASA ASSEMBLY CONSTITUENCY**

I, **APPALARAJU SEEDIRI :** (name of candidate), a candidate for the Above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

Sl.	Pending Criminal Cases		Details about cases of conviction for criminal offences		
	Name of Court	Case No. and Status of case	Section(s) acts concerned and brief description of offence(s)	Name of court & date(s) of order(s)	Description of offence(s) & punishment imposed
1	Not Applicable	33/2018 of Kasibugga PS -Pending-	143, 283, 341, 149 IPC	Not applicable	Doki Hareesh Issue Not Applicable
2	Not Applicable	133/2020 of Meliaputti -Pending-	188, 271, IPC	Not applicable Not applicable	Epidemic disease Act (Covid-19)
3	Not Applicable	115/2020 of RPF/Palasa -Pending-	145(b), 147, Railway Act	Not applicable Not applicable	Mob Trespassing Railway premise Not applicable

*In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.

Note: **(i) Details should be given separately for each case in separate rows.**

(ii) The matter in newspapers should be in font size of at least 12.

APPALARAJU SEEDIRI
YSRCP CONTESTING CANDIDATE,
NO.02, PALASA ASSEMBLY CONSTITUENCY

రెడ్డి శాంతి రోడ్ షో

ప్రజాశక్తి- కొత్తూరు

నిర్వాసితులకు వైసిపి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని దాసరథీపురం నుంచి మెట్టూరు బిట్ 1,2,3, మెట్టూరు కూడలి వరకు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ చేయాలని చేయాలని అభ్యర్థించారు. గత మేనిఫెస్టోలో పెట్టి పథకాలన్నీ అమలు చేసిన ప్రభుత్వం వైసిపిదేనని పేర్కొన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రెడ్డి శ్రావణ్‌కుమార్, మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, గోగుల వరప్రసాదరావు,


రోడ్ షో నిర్వహిస్తున్న రెడ్డి శాంతి

తోట నందకుమార్, కలమట రమేష్, బి.శ్రీను, పి.సాధుబాబు, ఎం.చక్రపాణి, సింహాద్రినాయుడు, జి.ఆనందరావు, ఎల్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌ను ఆదరించాలి


ప్రచారం చేస్తున్న త్రినాథ్‌బాబు

ప్రజాశక్తి- మందస

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, అందుకు ఓటర్లు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబు కోరారు. ఈ మేరకు హోన్నాలి, పింపిలి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి, టిడిపి నాయకుల మాటలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే మందస ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఇప్పటికే పలాస నియోజకవర్గం భూ కబ్జాలు దౌర్జన్యాలతో నిండి పోయిందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసి ప్రజలకు అండగా ఉంటామని అన్నారు. 2007లో మన్మోహన్ సింగ్ హయాంలో ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారని అన్నారు. అలాగే వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. కార్యక్రమంలో కొర్ల హేమారావు చౌదరి, కాంగ్రెస్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న గొండు శంకర్

అభివృద్ధిలో అడుగులు కలపండి

వాకర్స్, క్రీడాకారులను కోరిన శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యానికి అడుగులు వేసే వాకర్స్ అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు కూటమి విజయంలో భాగస్వాములై ముందడుగు వేయాలని శ్రీకాకుళం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ కోరారు. శుక్రవారం నగరంలోని 80 అడుగుల రోడ్డులో వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. అనంతరం వారితో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వైసిపి గత ఐదేళ్ల పాలనలో అమలు చేసిందని, జగన్ నియంతృత్వ పోకడలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. జగన్ పాలనలో నియోజకవర్గంలో సొంత నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ మంత్రులకు, ఎమ్మెల్యేలకు లేకుండా ఆ నలుగురు చేతిలో నలిగిపోయారని, దీనివల్ల అభివృద్ధి తిరోగమనానికి దారితీసిందన్నారు. తిరోగమనం చెందిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టి అభివృద్ధి పథంలో నడిపించే సామర్థ్యం ఉన్న చంద్రబాబుకు అండగా నిలవాలన్నారు. అనంతరం క్రికెట్ క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15వ డివిజన్‌లో ప్రజాగళం

ఉమ్మడి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలు ఘన విజయాన్ని అందిస్తాయని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని 15వ డివిజన్‌లో డివిజన్ ఇన్‌ఛార్జి విభూది సూరిబాబు, నగర టిడిపి అధ్యక్షుడు మాదారపు వెంకటేష్‌ల ఆధ్వర్యాన శుక్రవారం ప్రజాగళం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలు, ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. జగన్ గత ఎన్నికల్లో మేనిఫెస్టో మత గ్రంథాలతో సమానమని నమ్మించి వాటిని అమలు చేయకుండా 99 శాతం పూర్తి చేశామని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే చంద్రబాబుకు అండగా నిలవాలని, అందులో భాగంగా శ్రీకాకుళం అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా కింజరాపు రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, డివిజన్ నాయకులు గద్దె సుభాష్, పెద్ది కవిత, కటారి కమల, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యకారులను మోసం చేసింది వైసిపినే

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పదవీ కాలంలో మత్స్యకారులను మోసం చేసిందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. మండలంలోని హుకుంపేట, పూడిజగన్నాథపురం, కంబాలరాయుడుపేట, ఉద్దానం గోపినాథపురం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత్స్యకారులకు మంచి చేకూరుతుంద న్నారు. ఒక్క ఛాన్స్‌తో అధికారంలోకి వచ్చిన వైసిపి రాష్ట్ర ప్రగతిని అధోగతి పాలు చేసిందన్నారు. అరాచక పాలనకు చరమగీతం పాడడానికి సహకరించాలని కోరారు. పింఛన్లు పంపిణీ గందరగోళం చేసి వృద్ధులకు, వికలాంగులకు వైసిపి ప్రభుత్వం నరకం చూపిస్తుందన్నారు. వైసిపి పాలనలో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు సూరాడ మోహనరావు, మాజీ ఎంపిపి జి.వసంతస్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు పుచ్చ ఈశ్వరరావు, కణితి సురేష్, పి.సాంబమూర్తి, మహిళా అధ్యక్షులు పుచ్చ శోభారాణి, బి.శశిభూషణ్, దువ్వాడ లక్ష్మీభార్గవి, తిమ్మల కృష్ణారావు, కర్ని రమణ, గోవింద పాపారావు, వంక రామారావు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న గౌతు శిరీష

ఈసారీ అలాగే ఫలించేనా?


- ఆమదాలవలసలో గెలిచిన వారిదే ప్రభుత్వం
- హోరాహోరీగా అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆమదాలవలస నియోజకవర్గ అభ్యర్థి గెలుపు పైనే రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు జరుగుతుందని ఊహాగానాలు ఊపందుకున్నాయి. 1976 డీలిమిటేషన్ ఉత్తర్వులు ప్రకారం అప్పటివరకు ప్రస్తుత జలుమూరు మండలంలో ఉన్న నగిరికటకం నియోజకవర్గంగా ఉన్న ఈ ప్రాంతమంతా ఆమదాలవలస నియోజకవర్గంగా ఆవిర్భవించింది. మొదటిసారి 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పైడి శ్రీరామ్మూర్తి, పీరుకట్ల వెంకట అప్పలనాయుడు, తమ్మినేని పాపారావులతో పాటు మెట్ట జగ్గుబట్లు, బాన్న కరుణాకరరావు లు పోటీ చేయగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పైడి శ్రీరామ్మూర్తి, కాంగ్రెస్ (ఐ) అభ్యర్థి పీరుకట్ల వెంకటప్ప నాయుడుపై 3,357 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 1983 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి తమ్మినేని సీతారాం చేతిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పైడి శ్రీరామ్మూర్తి 4,273 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో ఏకంగా ఎనిమిది మంది అభ్యర్థులు అసెంబ్లీ బరిలో నిలవడం విశేషం. 1985లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు పోటీ చేయగా, మళ్లీ పైడి శ్రీరామ్మూర్తిపై టిడిపి అభ్యర్థి తమ్మినేని సీతారాం 2,129 స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు. 1989 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి తమ్మినేని సీతారాంపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పైడి శ్రీరామ్మూర్తి 3,496 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురానికి చెందిన కిల్లి వరాహనరసింహం ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగారు. శాసనసభ్యులుగా ఎన్నికైన శ్రీరామ్మూర్తి అనారోగ్య కారణంగా మృతి చెందారు. 1991లో జరిగిన ఉప ఎన్నికలో అప్పటికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా... కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు బొడ్డేపల్లి రాజగోపాలరావుపై తమ్మినేని సీతారాం విజయం సాధించారు. 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి తమ్మినేని సీతారాం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డేపల్లి చిట్టిబాబుపై 5,234 మెజార్టీతో విజయం సాధించి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొందారు. ఈ ఎన్నికల్లో ఏడుగురు అభ్యర్థులు పోటీపడ్డారు. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి తమ్మినేని సీతారాం అప్పటి ఆమదాలవలస మున్సిపాలిటీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డేపల్లి సత్యవతిపై కేవలం 1511 అతి స్వల్ప ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో చోటు దక్కింది. 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రిగా ఉన్న సీతారాంపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొడ్డేపల్లి సత్యవతి విజయం సాధించింది. 2008లో సినీ హీరో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించారు. ఈ పార్టీలోకి తమ్మినేని సీతారాం చేరారు. 2009 జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌నుంచి సత్యవతి, టిడిపి



సీతారాం


రవికుమార్


అన్నాజీరావు


సువ్వారి గాంధీ

నుంచి కూన రవికుమార్, ప్రజారాజ్యం నుంచి సీతారం పోటీ చేశారు. ఈ పోటీలో బొడ్డేపల్లి సత్యవతి 16,209 మెజార్టీతో రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2013లో రాష్ట్ర విభజన, తరువాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ వైసిపి అభ్యర్థి తమ్మినేని సీతారాంపై 5,449 ఓట్ల మెజార్టీతో విజయం సాధించి రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ ఎన్నికల్లో వీరితోపాటు మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి కాంగ్రెస్ అభ్యర్థిగా, మాజీ ఎమ్మెల్యే పైడి శ్రీరామ్మూర్తి పైడి సత్య ప్రసాద్ జైసమైక్య ఆంధ్రా పార్టీ తరపున, తమ్మినేని అన్నం నాయుడు లోక్‌సత్తా పార్టీ తరపున, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, ఆమ్‌ఆద్మీ పార్టీ అభ్యర్థి, డి.పుణ్యవతి బిఎస్‌పి, మరో ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీ చేశారు. 2019లో వైసిపి అభ్యర్థి తమ్మినేని సీతారాం, టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ అసెంబ్లీ అభ్యర్థులుగా మామ అల్లుళ్ల మధ్య రెండోసారి పోటీ ఏర్పంది. ఈ ఎన్నికల్లో అల్లుడుపై మామ సీతారాం 13,991 ఓట్ల మెజార్టీతో విజయం సాధించి ప్రస్తుతం శాసనసభ స్పీకర్‌గా కొనసాగుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొడ్డేపల్లి సత్యవతి, బిజెపి అభ్యర్థిగా పాతిన గడ్డయ్య, జనసేన పార్టీ అభ్యర్థిగా పేడాడ రామ్మోహనరావు, స్వతంత్ర అభ్యర్థిగా తూలుగు సతీష్ ఎన్నికల బరిలో నిలిచారు. ప్రస్తుతం జరగనున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమదలవలస నియోజకవర్గ పరిధిలోని పొందూరు, బూర్జ, ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాలతో పాటు ఆమదాలవలస మున్సిపాలిటీకి చెందిన 259 పోలింగ్ కేంద్రాల్లో 1,92,560 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 95,545 మంది పురుషులు, 96,999 మహిళా ఓటర్లు, 16 మంది ట్రాన్స్ జెండర్స్ ఓటర్లుగా ఉన్నారు. ఇప్పటివరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆరుసార్లు టిడిపి విజయం సాధించగా, నాలుగు సార్లు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అలాగే 2019 ఎన్నికల్లో వైసిపి విజయం సాధించింది. గత విజయాలు చూసుకుంటే ఆమదాలవలస నియోజకవర్గంలో ఏ పార్టీ విజయం సాధిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపడుతుందని ఈ ప్రాంతంలో నమ్మకం. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా కూన రవికుమార్, వైసిపి అభ్యర్థి ప్రస్తుత స్పీకర్ తమ్మినేని సీతారాం, కాంగ్రెస్ పార్టీ నుంచి సనపల అన్నాజీరావు, వైసిపి రెబల్ అభ్యర్థిగా సువ్వారి గాంధీ, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గత కొంతకాలంగా ఆమదా లవలసలో ఏ పార్టీ నెగ్గితే... ఆ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే.




ప్రచారం చేస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

టిడిపి వస్తే ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి, జనసేన, బిజెపి కలిసిన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే యువతకు భవిష్యత్ ఉంటుందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని చిన్నతుంబయ్యపేట, నారాయణవలస, రేగులపాడు, కొప్పలపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కుటమి అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు గురించి వివరించారు. టిడిపి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు ను, తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, బోయిన రమేష్, పూజారి శైలజ పాల్గొన్నారు.

వైసిపితోనే సంక్షేమం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వైసిపితోనే సంక్షేమ పథకాలు అమలు సాధ్యమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. మండలంలోని బెల్లుపడలో 12.13.14 వార్డుల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపికి కంచుకోటగా ఉన్న ఈ వార్డులో వైసిపి ప్రచారానికి భారీగా తరలివచ్చారు. మున్సిపల్ చైర్‌పరసన్ పిలక రాజ్యలక్ష్మి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ వార్డులో కౌన్సిలర్లు నీలపు లక్ష్మి, బి.ఆదిలక్ష్మి పర్యవేక్షణలో భారీ ర్యాలీ చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో వస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, ప్రజలు వాస్తవాలను గమనించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి విజయను, పేరాడ తిలక్‌లను గెలిపించాలని కోరారు. ర్యాలీఓ వైసిపి నాయకులు నర్తు నరేంద్ర యాదవ్, ఉలాల భారతీదివ్య, పిలక విజయ భాస్కర్‌రెడ్డి, గుజ్జు తారకేసు, తాడి ఆదిరెడ్డి, ప్రత్తి అన్వేష్, ప్రకాశరావు పట్నాయక్, రాంజీ, సాలీనా ఢిల్లీ, త్రినాథ్, నీలపు ఢిల్లీ పీతాంబర రెడ్డి పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న విజయ

నిత్యం ప్రజలతోనే ఉన్నా...

కవిటి: నిత్యం ప్రజలతోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడానని, ఇప్పటి వరకూ తనపై చూపించిన అభిమానాన్ని కొనసాగిస్తూ మరోసారి ఆదరించాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఓటర్లని కోరారు. జనసేన నాయకులు లోల్ల రాజేష్, దాసరి రాజు, బిజెపి కన్వీనర్ నిర్మల రెడ్డితో కలిసి మండలంలోని కొత్తూరులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమ పథకాలు వివరించారు. రాష్ట్రాభివృద్ధి పథంలో పయాణించాలంటే చంద్రబాబు నాయుడు నాయకత్వం అవసరమని చెప్పారు. కార్యక్రమంలో బెందాళం రమేష్, పొందల కృష్ణారావు, ఆరింగి మధు, బెందాళం తిరుమల తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

హామీలన్నీ అమలు

మంత్రి అప్పలరాజు


ప్రచారం చేస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఓటర్లను కోరారు. మండలంలోని సుంకరజగన్నాథపురం, కొత్తపేట, ఉద్దానం రామకృష్ణాపురం, పాతటెక్కలి, లింగాలవలసలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు, కార్యకర్తలు ఊరేగింపుగా గ్రామాల్లోకి తీసుకొచ్చి స్వాగతం పలికారు. గడపగడపకు వెళ్లి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంతటి సంక్షేమం గతంలో ఎప్పుడైనా చూశారా అని అన్నారు. టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోకు ఏమి విలువ ఉంటుందని అన్నారు. పొరుగు మేనిఫెస్టోలతో చంద్రబాబు కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. అమలు కానీ హామీలు ఇచ్చి ఎలాగైనా అధికారంలోకి రావాలనేది చంద్రబాబు చూస్తున్నారని అన్నారు. ఇప్పుడు అందుతున్న సంక్షేమం జగనన్న మళ్లీ అధికారంలోకి వస్తేనే కొనసాగుతాయని అన్నారు. తనకు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, హనుమంతు వెంకటరావుదొర, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, సర్పంచ్‌లు అంబటి శ్రీను, చింత హేమారావు, టి.సుశీల, దున్న బాలరాజు, అట్టాడ గోపి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి


కాంగ్రెస్ కండువా వేస్తున్న చక్రవర్తిరెడ్డి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాసుపత్రి చక్రవర్తిరెడ్డి చాపకింద నీరులా విస్తృతంగా ప్రచారం చేస్తూ... దూసుకుపోతున్నారు. ఈ నియోజకవర్గంలో హస్తం గుర్తుకి సంప్రదాయ ఓట్లు రాబట్టేందుకు చక్రవర్తిరెడ్డి చాకచక్యంగా వ్యవహరించి ఇతర పార్టీల నుంచి కార్యకర్తలను కాంగ్రెస్‌లోకి చేర్పుస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం మండలంలోని కొలిగాం ఎంపిటిసి, కీర్తిపురం, పాయితారీ, కొలిగాం పంచాయతీల నుంచి వైసిపి గృహసారథి లోపింటి దుర్యోధన ఆధ్వర్యాన ప్రభాకర్ ప్రధాన్, పాయితరి మాజీ సర్పంచ్ కె.ఢిల్లీనాయక్, రీతానాయక్, తేలుకుంచి పంచాయతీ నుంచి ఎం.లింగరాజుతో కలిసి వంద కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. వీరందరికీ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అభ్యర్థి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండూ సంపూర్ణంగా సాధించాలంటే కాంగ్రెస్స్ పార్టీతోనే సాధ్యపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాపారావు, దుర్యోధన, ప్రభాకర పాల్గొన్నారు.

ఎంపీ సతీమణి ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం పార్లమెంట్ టిడిపి అభ్యర్థి రామ్మోహన్‌నాయుడు సతీమణి శ్రావ్య శ్రీకాకుళం నగరంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. స్థానిక ఫ్రెండ్స్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి రామ్మోహన్‌నాయుడిని గెలిపించాలని అభ్యర్థించారు. సందర్భంగా కాలనీలో పలువురు మహిళలు ఆమె హారతి ఇచ్చి గౌరవించారు.


ప్రచారం చేస్తున్న శ్రావ్య

జగన్మోహన్ రెడ్డిని తరిమికొట్టాలి

ప్రజాశక్తి- బూర్జ

రాష్ట్రంలో మద్యం, ఇసుక వ్యాపారి అయిన జగన్మోహన్ రెడ్డిని ఈ రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలని తెలుగుదేశం పార్టీ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం టిడిపి ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలో అన్నంపేట, తిమడాం, టిడిఆర్ పేట, తోటవాడ, సింగన్నపాలెం, లచ్చయ్య పేట, ఒవిపేట, ఉప్పినివలస, వైకుంఠపురం, బొడ్డపాడు, కొరగాం, బొరగవలస, కటకమయ్యపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఇసుక, మద్యం వ్యాపారాన్ని తరిమికొట్టి ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందని, కేంద్రంలో బిజెపి అధికారంలో ఉన్నప్పటికీ ఈ రాష్ట్ర అవినీతి పాలనగా మారిందని నిర్ధారించి కూటమిగా ఏర్పడి భావితరాల భవిష్యత్‌ను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరు ఓటువేసి అవినీతి పాలన అంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ నాయుడు, మొదలవలస రమేష్, మండల పార్టీ అధ్యక్షులు బి.సీతారాం బాబు నాయుడు, సూరప్ప నాయుడు, కొత్తకోట నాగేందర్, సీతబాబు, ప్రభాకరరావు, అంపిలి గణపతిరావు, సత్యం, కన్నం నాయుడు, హరిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్



శ్రీనివాసాచార్యులపేటలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

అనవసర తగాదాలకు వెళ్లొద్దు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్నికల వేళ అనవసర తగాదాలకు వెళ్లి ఇబ్బందులు పడొద్దని ఎస్ఐ కె.వెంకటేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని శ్రీనివాసాచార్యులపేట, అక్కులపేట గ్రామాల్లో కేంద్ర భద్రత బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి గ్రామాల్లో ప్రజలందరూ సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా యువత రాజకీయ పార్టీల తరపున అనవసర వివాదాలకు దిగి కేసుల్లో ఇరుక్కుని తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర భద్రతా బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో రామ్మోహన్ నాయుడు, శంకర్

టిడిపిలో 40 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని నైర పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు సర్పంచ్ అరవల రామ ప్రతాప్, అరవల రవీంద్రబాబు, కర్రి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శంకర్ సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. టిడిపిలో చేరిన వారిలో అరవల అనిల్ కుమార్, రంజిత్ కుమార్, బొబ్బాది రమణబాబుతో పాటు పలువురు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. వీరికి ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జగన్నాథరావు

రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

రానున్నది చంద్రన్న సంక్షేమ రాజ్యమేనని మాజీ ఎంపిపి గొండు జగన్నాథరావు అన్నారు. మండలం ఇప్పిలి పంచాయతీలో పలు చెరువుల్లో జరుగుతున్న ఉపాధి పనులను పిల్లా మౌళి, ఐ.వి.రమణ ఆధ్వర్యంలో జగన్నాథ రావు సందర్శించారు. వేతనాదారులతో మాట్లాడుతూ బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. చంద్రన్న అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా ముందుకు వెళ్లనున్నారని తెలిపారు. బాధ్యత కలిగిన పౌరులుగా రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరికి ఉందన్నారు. ఎంపీ అభ్యర్థిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి, మహిళా అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి అన్నారు. మండలం దీపావళి పంచాయతీలో మాజీ సర్పంచ్, మాజీ మండలాధ్యక్షుడు గొండు వెంకటరమణ మూర్తి, ఎంపిటిసిలు వెలమల శ్రీనివాసరావు, గుజ్జల హిమగిరి, గొండు అచ్యుత, రుప్ప ముసలి నాయుడు ఆధ్వర్యంలో చెరువుల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం అంపోలు పంచాయతీలోని మంగళవారం పేట, చిన్న అంబటివాని పేట, కోళ్ల పేట గ్రామాల్లో నిర్వహించిన ప్రజాగళం, బాబు సూపర్ సిక్స్ పథకాల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు, ఉమ్మడి మేనిఫెస్టోలోని ప్రధాన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత అయిదేళ్లలో సిఎం జగన్ అక్క, చెల్లెమ్మలు అంటూ సంక్షేమ ఫలాలు అందించకుండా మహిళలను మభ్యపెట్టారని విమర్శించారు. జగన్ అరాచక పాలనలో మహిళలపై అకృత్యాలు పెరిగిపోయాయన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చంద్రబాబు కృషి చేస్తారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కూటమి ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



పోస్టర్లను పంపిణీ చేస్తున్న స్వాతి

డిఎ, ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలి

పెన్షనర్ల సంఘం డిమాండ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పెన్షనర్ల డిఎ ఎరియర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని లక్ష్మీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో సంఘ అధ్యక్షుడు సురవరపు సిమ్మి నాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధనరావు మాట్లాడుతూ 1-7-2018 నుంచి 31-12-2023 వరకు రావాల్సిన డిఎ ఎరియర్లు 2022 పిఆర్‌సి ఎరియర్లు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తుందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని మండిపడ్డారు. సంఘ కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ మాట్లాడుతూ పెన్షనర్ల సంఘ సమస్యలను వివరిస్తూ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పివిఎన్ మాస్టారు, కె.షణ్ముఖరావు, బెండి సూర్య నారాయణ, కె.జనార్దన రావు, బివి రమణ, దన్నాన శ్రీరామ్మూర్తి, జె.ఎన్.రాజు, బెండి నారాయణరావు, నూక సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి జనార్ధనరావు

బెదిరింపులకు పాల్పడితే తాటతీస్తా



మాట్లాడుతున్న తమ్మినేని

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ఎవరైనా, ఎంతటి వారైనా బెదిరింపులకు పాల్పడితే తాట తీస్తానని టిడిపి నాయకులను ఉద్దేశించి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం సరుబుజ్జిలి మండలంలోని కొండవలస, పెద్దపాలెం, రావివలస, పెద్ద వెంకటాపురం, వీరమల్లి పేట, సింధువాడ, పెద్దసవలాపురం, కొత్తకోట, సలంత్రి, రొట్టవలస గ్రామాల్లో తమ్మినేని సీతారాం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా తమ్మినేని దత్తత గ్రామమైన సింధువాడ పంచాయతీ పరిధిలోని వీరమల్లి పేట గ్రామానికి ఆయన చైతన్య రథంపై చేరుకొన్నారు. ఇటీవల ఈ గ్రామం నుంచి గ్రామస్తులంతా కలిసి ఒకే నిర్ణయంతో టిడిపిలో చేరారు. రోడ్ షోలో సీతారాం మాట్లాడుతూ వీరమల్లి పేట గ్రామాన్ని తాను దత్తత తీసుకొని సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావును గ్రామానికి తీసుకువచ్చి ఎంతో అభివృద్ధి చేసి మోడల్ విలేజ్‌గా రూపొందించానని, ఎవరో చెప్పిన మాటలు విని తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం మంచిది పద్ధతి కాదన్నారు. అంతే కాకుండా వైసిపిని అభిమానించే వ్యక్తులను కట్టడి చేయడానికి కొంతమంది బెదిరింపులకు పాల్పడడం మంచి పద్ధతి కాదని, అలా జరిగితే తాటతీస్తానంటూ స్పీకర్ తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన వైస్ ఎంపిపి శివానందమూర్తి మాట్లాడుతూ తాను ఏ తప్పు చేయలేదని, ఎవరైనా తాను తప్పు చేసినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి అభివృద్ధి కోసం తన ఆస్తులు అమ్మయినా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. అయినప్పటికీ వీరమల్లి పేట గ్రామానికి చెందిన ప్రజలు ఎవరు కూడా వైసిపి ప్రచార పరిసర ప్రాంతాలకు రాకపోవడం పట్ల మండలానికి చెందిన పలువురు గ్రామస్తుల ఐకమత్య కట్టడిపై చర్చించుకున్నారు. గతంలో తమ్మినేని సీతారాం ఇదే గ్రామానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైనప్పుడు గ్రామంలో రహదారులు, డ్రైనేజీ, తదితర మౌలిక సదుపాయాలు కల్పించలేదని, ఎన్నికల ప్రచారం నాడు వచ్చి, మళ్లీ నేడు వచ్చారని ఆగ్రహంతో తమ్మినేని సీతారాంను అప్పట్లో ఆ గ్రామ ప్రజలు నిలదీశారు.

వైసిపికి బుద్ధి చెప్పాలి

ఆమదాలవలస: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రంలో ప్రగతి సాధ్యమని టిడిపి మండల నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, బొడ్డేపల్లి గౌరీపతి అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీనివాసాచార్యులపేట, అక్కులపేట గ్రామాల్లో సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి పోస్టర్లు పంపిణీ చేస్తూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ వైసిపి పాలనలో వినాశనమే గాని అభివృద్ధి ఎక్కడ కానరాలేదని, రహదారులు గుంతలుగా మారి పాడైనప్పటికీ ఐదు సంవత్సరాల కాలంలో వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోలేదని ప్రజలకు వివరించారు. ఇప్పటికైనా ప్రజలు జగన్మోహన్ రెడ్డి నవ మోసాలను గ్రహించి రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, గొండు రమణ, నేతింటి జ్యోతి, తమ్మినేని అమర్నాథ్, ఎండ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

వైసిపిలో పలు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గోవిందపురం పంచాయతీ ఇజ్జడాపాళెంకు చెందిన 19 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో శుక్రవారం చేరారు. వీరికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీకు అండగా ఉంటానన్నారు. పార్టీలో చేరిన వారిలో ఇజ్జడా ధర్మారావు, చిన్నప్పుడు, సత్యం, వెంకటేష్, శ్రీను, పతివాడ మాలచ్చి, సీతంనాయుడు, సన్యాసినాయుడు ఉన్నారు. కార్యక్రమంలో లావేరు జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, ఎంపిటిసి ఇజ్జడా రాము, పి. గంగునాయుడు, నందన్న తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రామ్‌మనోహర్ నాయుడు

జగన్‌తోనే సంక్షేమ పాలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అట్టడుగున ఉన్న ప్రజలను ఆర్థికంగా పైకి తీసుకు రావాలన్న లక్ష్యంతో సంక్షేమ పాలన అందించిన జగన్‌కు మరోసారి విజయాన్ని అందించాలని వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు అన్నారు. శుక్రవారం గార మండలం శ్యాంపాలెంలో ఉపాధి కూలీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మ్యానిపెస్టోను 99 శాతం నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కు తుందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను నేరుగా ఇంటికే అందించి అవినీతి లేని పాలనను అందించారన్నారు. కార్యక్రమంలో గార మండల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆడవరంలో వేసవి వినోదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గార మండలం ఆడవరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు భోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో 'వేసవి వినోదం' పేరిట వేసవి సెలవులు ఇచ్చినప్పటి నుంచి విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం గంట సేపు ఒక్కొక్క అంశంపై కథలు చదివించడం, రాయించడం, పద్యాలు నేర్పించడం, ఎక్కాలు నేర్పించడం, ముందు తరగతుల పాఠ్యాంశాలను చదివించడం, డాన్స్ నేర్పించడం, జానపద గేయాలు, దేశభక్తి గేయాలు విద్యార్థులచే నేర్పిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం విద్యార్థులతో మోరల్ ఆక్టివిటీ చేశారు. ఈ ఆక్టివిటీలో 'బస్సులో ప్రయాణం చేస్తున్నప్పుడు వికలాంగులకి, గర్భిణీలకు, పిల్లలను ఎత్తుకొని సీట్ లేక నిలబడి ఇబ్బంది పడేవారికి, ఏవిధంగా గౌరవించి వారికి సీట్ ఇవ్వాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం నిమ్మకాయ నీరు విద్యార్థులకు అందజేశారు. ఈ స్కిట్‌లో ముంత తనుజ, అఖిల్, మేఘన, మనస్వి, భరత్, నిఖిల్, విజయ రాజు, అనూప్ కుమార్, మేఘన తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు



ఎంపికైన నాట్య కళాకారులు

కాశీలో నాట్య ప్రదర్శనకు ఎంపిక

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం శ్రీ స్వేచ్ఛ నృత్య తరంగిణి కూచిపూడి భరతనాట్యం జానపద నాట్య శిక్షణాలయం కళాకారులకు అరుదైన అవకాశం లభించిందని ఆర్గనైజర్ బి.నరేంద్ర, అకాడమి చైర్మన్ కె.గోవిందరావులు తెలిపారు. కాశీ క్షేత్రంలో ఈ నెల 5న శ్రీవాగ్దేవి వాద్య సంగీత కళ నృత్య సాంస్కృతి సంస్థ ఆధ్వర్యాన కాశీ విశ్వనాథుని వద్ద నృత్యం ప్రదర్శించనున్నారని అన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు పయనమయ్యారు. నాట్య గురువు మంగి దివ్య, కె.కుమార్, పి.వర్షిత, బి.నాయని. పి.సత్యశ్రీ, ఎం.తేజేశ్రీ, డి.జ్ఞానేశ్వరి, డి.ఉపాసన. సిహెచ్.సహస్ర మానస, బి.అనుశ్రీ, బి.హిమసాయి, శ్రీవల్లిక, బి.రోషిని, సాయి దీపన్విత. ఎం.వర్షిణి. సిహెచ్.భూమిక. జి.ద్రవ్యలు ఉన్నారు.



టిడిపి కండువా వేస్తున్న రమణమూర్తి

టిడిపిలో చేరికలు

పోలాకి : రోజురోజుకీ టిడిపిలోకి వలసలు పెరుగుతున్నాయని ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. పోలాకి పంచాయతీకి చెందిన నరసాపురానికి చెందిన సనపల నారాయణరావు, మెట్టపేటకు చెందిన మెట్ట తిరుమలరావు శుక్రవారం టిడిపిలో చేరారు. వారికి రమణమూర్తి మబగాంలో స్వగృహంలో టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఎం.వెంకటఅప్పలనాయుడు, లుకలాపు రాంబాబు, కె.గౌరినాయుడు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- కవిటి

కవిటిలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్ కోసం రాజపురం నుంచి వేస్తున్న 33 కెవి లైన్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి కవిటి టౌన్ లైన్ మైంటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో కవిటి, కవిటికొత్తూరు, గొండ్యాలపుట్టుగ, ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



ప్రచారం చేస్తున్న శ్రావణి

కృష్ణదాస్ కోడలు ప్రచారం

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని బెలమర, బెలమర కూడలి, పాలవలస, కోడూరు గ్రామాల్లో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పెద్ద కోడలు ధర్మాన శ్రావణి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి కృష్ణదాస్, ఎంపీ పేరాడ తిలక్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, సర్పంచ్ ప్రతినిధి చింతు రాఘవరావు, చింతు సింహాచలం, ఎఎంసి చైర్మన్ దుంపల భాస్కరరావు, సనపల సోమేశ్వరరావు, కె.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఎంపిపి ఆగ్రహం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు



మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజ కావడంతో ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి అధికారులు హాజరుకాకపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఇక ముందు అధికారులు గైర్హాజరైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అధికారులు హాజరు కాకుంటే ప్రజా సమస్యలపై సభ్యులు అడిగే ప్రశ్నలకు ఎవరు సమాధానం చెబుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ తిరుమలరావు మాట్లాడుతూ ఈ సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేస్తామని అన్నారు. కాగా, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎలాంటి చర్చ లేకుండా సమావేశం ముగిసింది. సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైస్ ఎంపిపి వంక రాజు, మండల విప్ గుణ పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- నందిగాం

టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని కోటియాకొండపేట, కోటిపల్లి, బడవంద, సైలాడ పంచాయతీలోని రౌతుపురం, బంజీరిపేట గ్రామాల్లో, దేవాడదొడ్డ, రామచంద్రాపురం, మొద్దువాడ, నరేంద్రపురం, కృష్ణరాయపురం, నారాయణపురం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ ఎన్నిక మన భావితరాల బంగారు భవిష్యత్ కోసమని అన్నారు. సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కింజరాపు



శివరాంపురంలో ప్రచారం చేస్తున్న అచ్చెన్నాయుడు

రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పి.అజయ్ కుమార్, పి.చంద్రశేఖర్, ఎ.రవిప్రసాద్, కె.ప్రసాదరావు, ఎం.బాలకృష్ణ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో గౌతు శిరీష

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

స్థానిక టిడిపి కార్యాలయంలో మండల మండలం కిల్లోయి, సింకర్లపుట్టుగ గ్రామాల నుంచి వైసిపి నుంచి టిడిపిలోకి పలువురు చేరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష శుక్రవారం పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దున్న వాసుదేవరావు, దిలీప్, టి.లోకనాథం, దున్న కిరణ్, దున్న చరణ్, దున్న జగన్, బి.సిద్ధు, జుత్తు వైకుంఠరావు, పి.శ్రీను, సవర ఉంగలాగ్గు ఉన్నారు. టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు అధికంగా వస్తున్నారని శిరీష అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వసంతిస్వామి, బి.ఉమాపతి, బి.తాతారావు, ఎం.తాతారావులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జగన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు చింతాడ మంజు అన్నారు. టెక్కలిలోని కచేరివీధి, శంభానవీధి, బాపరెడ్డి కాలనీల్లో శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు అమలు చేసిన ఘనత వైసిపికే దక్కిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి



ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

కొనసాగాలంటే వైసిపి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండెలి సుజాత, టౌన్ పార్టీ అధ్యక్షులు తమన్నగారి కిరణ్, ఎంపిటిసి కూన పార్వతి, పీత హేమలత, వాకాడ శ్రీధర్‌రెడ్డి, నాగళ్ల శంకరావు, వారణాసి గోవిందరావు, చంటి పాల్గొన్నారు.



మెళియాపుట్టి : కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

వచ్చే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్య ప్రాంతాల్లో సిఐ నల్లి సాయి ఆధ్వర్యాన కేంద్ర బలగాలతో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. మండలంలోని మెళియాపుట్టి, చాపర, గొప్పిలి గ్రామాల్లో కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ సాయి, ఎస్ఐ టి.రాజేష్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని రాజకీయ వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.

కాశీనగర్‌లో...

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ పట్టణంలో ఐఐసి గోవింద్‌గౌర్ ఆధ్వర్యాన త్రిపుర ఆర్మ్‌డ్ పోలీస్ బెటాలియన్-4వ, కాశీనగర్ పోలీసులు కలిసి కవాతు నిర్వహించారు. వచ్చే సార్వత్రి ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఎవరూ ఎటువంటి హింసాత్మక చర్యలకు పాల్పడకుండా శాంతియుతంగా ఉండాలన్నారు. తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




వైసిపి కండువా వేస్తున్న కృష్ణదాస్

కృష్ణదాస్ ప్రచారం

ప్రజాశక్తి- పోలాకి

ఇంటింటికీ సంక్షేమ పథకాలను సిఎం జగన్మోహన్‌రెడ్డి అందజేశారని, అందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఓటర్లను కోరారు. ఈ మేరకు మండలంలోని కొమ్ముసిరియాపల్లి, పెద్దగుజ్జువాడ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి అమలు చేసిన పథకాలు, మేనిఫెస్టోను వివరించారు. అనంతరం ఉప సర్పంచ్, జనసేన పార్టీ నాయకుడు కొండాల సన్యాసినాయుడు వైసిపి గూటికి చేరారు. ఆయనతో పాటు 20 కుటుంబాలు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. సన్యాసినాయుడు మాట్లాడుతూ టిడిపి, జనసేన అనైతిక పొత్తుని వ్యతిరేకిస్తున్నాని అన్నారు. కృష్ణదాస్ గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వరుదు వంశీకృష్ణ, వరుదు దేవీప్రసాద్, చిన్నాల లక్ష్మీనారాయణ నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు గెల్లంకి వెంకట్రావు, గొర్ల డిల్లీరావు, నక్క తులసీదాస్, పల్లి కృష్ణయ్య, బాడాన కృష్ణారావు, వెలమల సింహాచలం, కొండల బాబూరావు, గద్దిబోయిన గోవిందరావు, షన్ముఖరావు, పారశెల్లి తేజేశ్వరరావు పాల్గొన్నారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అర్హులందరికీ మత్స్యకార భరోసా

ప్రజాశక్తి- కవిటి

అర్హులైన మత్స్యకారులందరికీ మత్స్యకార భరోసా వర్తిస్తుందని మత్స్యశాఖ డిడి పి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఇద్దివానిపాలెం, చిన్నకర్రివానిపాలెం, కపాసుకుద్ది గ్రామాల్లో శుక్రవార మత్స్యకార భరోసా లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రతి మత్స్యకార కుటుంబాన్నీ సందర్శించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డిఒ కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- నందిగాం

ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లను గెలిపించాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి ఓటర్లను కోరారు. మండలంలోని మొండ్రాయివలస, సబ్బంపేట, ఆకులరఘునాథపురం, మద్దిలోడిపేట గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్ల అప్పారావు, ఎంపిటిసి నడుపూరు పాపారావు, పిఎసిఎస్ చైర్మన్ కురమాన బాలకృష్ణారావు, వైస్ ఎంపిపి రేగల కూర్మారావు, మండల పార్టీ అధ్యక్షులు తమిరె పాల్గుణరావు, జెసిఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం, సర్పంచ్‌లు పొలాకి మోహనరావు, మడపాల సంజీవరావు, పొందల లచ్చయ్య, బోలుభద్ర సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రవికుమార్

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 18వ వార్డులో కంద్రపేటకు చెందిన 10 ముస్లిం కుటుంబాలు మాజీ కౌన్సిలర్ బొడ్డేపల్లి లక్ష్మణరావు ఆధ్వర్యంలో షేక్ బకారి, అబ్బు తదితరులు కూన రవికుమార్ సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి కూన రవికుమార్ టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో పాటు టిడిపి విధి విధానాల పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరామని తెలిపారు.



మతలబుపేటలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మతలబుపేటలో పోలీసు కవాతు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి మండలం మతలబుపేటలో ఎన్నికల విధుల్లో భాగంగా ఎస్ఐ బి.నిహార్ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి శుక్రవారం తెల్లవారు జామున మతలబుపేట గ్రామానికి చేరుకున్న పోలీసులు గ్రామంలో ఉన్న ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని కొన్ని ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్‌కి తరలించారు. గ్రామ వీధుల్లో పోలీసులు కవాతు నిర్వహిస్తూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రతిఒక్కరు సహకరించాలని, ముఖ్యంగా యువత ఎన్నికల వివాదాల్లో తలదూర్చి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ నిహార్ పిలుపునిచ్చారు.



ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

అప్పలరాజును గెలిపించాలి

ప్రజాశక్తి- పలాస

టిడిపి అధికారంలోకి వస్తే జగన్మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని ఎంపిపి ప్రతినిది ఉంగ సాయికృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు అన్నారు. మండలంలోని అమలకుడియా గ్రామంలో ఎమ్మెల్యే అప్పలరాజు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లకు మద్దతుగా శుక్రవారం ఎన్నిక ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావులు, ఎంపిటిసి మాజీ సభ్యులు దంతం వైకుంఠరావు, సర్పంచ్ ప్రతినిధి కొర్ల మురళీకృష్ణచౌదరి, నాగరాజు పాల్గొన్నారు.

అలాగే మధ్యాహ్నం మండలంలో బ్రాహ్మణతర్లా, అమలకుడియా పంచాయతీ పూర్ణభద్ర గ్రామాల్లో వైసిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పూర్ణభద్రకు చెందిన శంకరరావు, ధర్మారావులు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో దంతం వైకుంఠరావు, కర్ర గంగాధర్, పొట్నూరు, తారకరామారావు, సీమ బాలరాజు, పడాల కలిదాస్, వట్టి వెంకటేశ్వరులు, పడాల వారి, నాగరాజు, మురళీకృష్ణ, వెంకటరావు పాల్గొన్నారు.

కాలువలపై పలకలు తీయరు.. పూడికలు కదలవు

- **దోమలు, ఈగలతో నరకం చూస్తున్న ప్రజలు**
- **మామ్ముళ్ల మత్తులో జోగుతున్న మున్సిపల్ అధికారులు**

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రధాన కాలువలపై ఉన్న సిమెంట్ పలకలతో పూడికలు కదలక పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న కాలువలపై దుకాణదారులు సిమెంట్ పలకలతో పూర్తిగా కప్పేయడం వలన కాలువలు చెత్తా చెదారంతో నిండి పూడికలు పెరిగి కప్పుకు పోవడంతో దుర్గంధం వెదజల్లి కంపుమయంగా మారి దోమలు, ఈగలతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవు తున్నారు. పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారుల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని వన్వే సెంటర్ వద్ద రోడ్డు పక్కన సాయంత్రం వేల తోపుడు బండ్లతో ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలను రోడ్డు పొడుగునా కొనసాగిస్తున్నారు. చిరుతిళ్లు తినే వ్యక్తులు పేపర్ ప్లేట్స్ డిస్పోజల్ గ్లాసులు వంటి వస్తువులను కాలువల్లో



ప్రధాన కాలువ మురుగు నీరు

పడేయడంతో చెత్త పేరుకుపోయి అధ్వానంగా మురికి కాలువలు దర్శనమిస్తున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పురపాలక సంఘంలో 23 వార్డుల్లో కూడా మురికి కాలువల్లో చెత్త ఎక్కడికక్కడే దర్శనమిస్తూ అపారిశుద్ధ్యం రాజ్యమేలుతున్నది. 23 వార్డులకు 74 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నప్పటికీ కొంతమంది మేస్త్రీలుగా అవతారం ఎత్తడంతో పారిశుద్ధ్య నిర్వహణ కష్టతరంగా మారుతుంది. ఇదే విషయం పలుమార్లు పారిశుద్ధ్య సిబ్బంది, ఆ సంఘ నాయకులు మున్సిపల్ కమిషనర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ రాజకీయ ఒత్తిడితో ఆ సమస్యపై అధికారుల దృష్టి సారించలేదన్న విమర్శలు విని



వన్‌వే సెంటర్ వద్ద చెత్తాచెదారంతో నిండిన కాలువ

పిస్తున్నాయి. ప్రతి ఏటా పురపాలక సంఘంలో సింహ భాగం నిధులను పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగి స్తున్నప్పటికీ ఆ నిధులు దారి మల్లుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాలకవర్గం లేకపోవడంతో అధికారుల ఇష్టారాజ్యంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువలపై పలకలు తీసి పూడికలు తొలగించకపోతే రహదారిపైనే మురికి నీరు ప్రవహించి రహదారి పక్కనే ఉన్న దుకాణ, నివాస సముదాయాల్లోకి మురికి నీరు చొరబడి ఇబ్బందులు పడిన సంఘటనలను ప్రజలు గుర్తు చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా మామూళ్ల మత్తును వీడి చర్యలు తీసుకొని దుర్గంధం, వ్యాధుల భారి నుంచి ప్రజలను కాపాడాలని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నేటికీ పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు



పురపాలక సంఘం ఏర్పడి 30 ఏళ్లు పైబడినప్పటికీ నేటికీ ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు. పాలకులు ఎన్నికల సమయంలో హామీలకే పరిమితం అవుతున్నారు తప్ప చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య ధోరణితో ప్రజా సమస్యలపై వ్యవహరించడం తగదు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కాలువల్లో పూడికలు తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- బొడ్డేపల్లి జనార్ధనరావు,
జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు



పూజారిపేటలో పూడికలతో కప్పబడిన మురుగు కాలువ

ఆదర్శ దంపతులకు ఆత్మీయ సత్కారం



గజమాలతో సత్కరిస్తున్న కాశీవిశ్వనాథ్

ప్రజాశక్తి- కవిటి

కవిటికి చెందిన మొగిలిపురి సింహాచలపతి, జయలక్ష్మి దంపతుల 50వ వివాహ వార్షికోత్సవ వేడుకలు స్థానిక లోల్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు, గ్రామీణ వైద్యునిగా దశాబ్దాల పాటు సేవలు అందించారు. సింహాచలపతి దంపతులను సొండి తరగతుల సంక్షేమ సంఘం, అతని ఆత్మీయులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయునిగా, ఆర్ఎంపి వైద్యునిగా సింహాచలపతి అందించిన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. ఈ దంపతులు నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో సొండి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీ విశ్వనాథచౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెహరా రాజారావు, రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.గణపతి, జిల్లా అధ్యక్షుడు సాహుకారి దివాకర్, రాష్ట్ర డైరెక్టర్ ప్రతినిధి పాండవ శ్రీనివాసరావు, సొండికుల పెద్దలు ఎల్.ప్రభాకర్, షావుకారి ఎల్లారావు, పాండవ రామారావు, పాండవ శేఖర్, ఎన్.గణపతి, ఎస్.షణ్ముఖరావు, కె.కృష్ణ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- పలాస

స్థానిక కంచరవీధికి చెందిన మాధవ పాత్రో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంకినమ్మ టైల్స్, మార్బుల్స్ యూనియన్ సభ్యులు మృతుని కుటుంబానికి శుక్రవారం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. నిరంతరం సహాయ సహకారాలు అందిస్తామని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మార్పు ఆత్మారావు, కేషీర్, ఎం.గణపతి, ఎం.శ్రీరాములు, జి.పురుషోత్తంలు పాల్గొన్నారు.

340 ఇవిఎంలు సిద్ధం

ప్రజాశక్తి- పలాస

ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలో భాగంగా అధికారులు ఇవిఎం సెట్లను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ భరత్ నాయక్ పర్యవేక్షణలో పోటీ చేసే అభ్యర్థు ల నాయకుల సమక్షంలో ఇవిఎంలను శుక్రవారం పరిశీలించారు. ఇవిఎంలు పనిచేస్తున్నాయా? లేదా? ఎటువంటి ఇబ్బందులు ఉన్నాయా? లేవా? పరిశీలించి అసెంబ్లీ ఎన్నికలకు ఇవిఎంలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ పలాస నియోజకవర్గం వరిధిలో 284 పోలింగ్ కేంద్రాలుండగా, 340 ఇవిఎం సెట్లను సిద్ధం చేశామన్నారు. అందుకు 37 సెక్టార్ అధికారులతో ఇవిఎంలను పరిశీలించామన్నారు. ఆయనతో పాటు తహశీల్దార్ ఎన్ఎస్‌విఎస్ నాయుడు ఉన్నారు.



సిద్ధం చేస్తున్న ఇవిఎంలు

పండుటాకుల పింఛను పాట్లు

ప్రజాశక్తి- పలాస

పండుటాకులకు పింఛను పాట్లు తప్పడం లేదు. బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించింది. దూరప్రాంతాల నుంచి పింఛన్లు తీసుకునేందుకు బ్యాంకులకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి వృద్ధులు, వితంతువులు ఇబ్బందులు తప్పడం లేదు. పలాస, మెళియాపుట్టి, వజ్రపుకొత్తూరు తదితర మండలాల నుంచి రెండో రోజు వితంతువులు, వృద్ధులు పింఛన్ల కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ప్రస్తుతం పింఛన్లు పంపిణీ బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో సుమారు 10 కిలోమీటర్లు దూర ప్రాంతం నుంచి పలాస స్టేట్ బ్యాంక్కు వస్తున్నామని, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బ్యాంకుల వద్దే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు ఎండ, మరో వైపు ఆటోలకు, బస్సులకు కాపలాకాస్తూ పలాస స్టేట్ బ్యాంకుకు వస్తున్నామని వాపోయారు. అధికారు అనాలోచిత నిర్ణయాల వల్ల వృద్ధులకు ఇబ్బందులు తప్పడం లేదన్న వాదన జోరుగా వినిపిస్తుంది. అధికారుల చొరవ చూపి వచ్చే నెలలో రావాల్సిన పింఛను డబ్బులు నేరుగా పంపిణీ చేయాలని పింఛనుదారులు కోరుతున్నారు.



బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న పింఛనుదారులు